క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: సంజీవయ్య పార్కు, లోధా, బేగంపేట, గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాష్‌నగర్, డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ పార్క్, టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీ–మార్ట్ ఏరియా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీన్‌పార్క్ హోటల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, సీఎం ఓల్డ్ క్యాంప్ ఆఫీస్, సీఎం బిల్డింగ్ ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా కృష్ణ ఆదిత్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ములుగు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ఆయనను పీసీబీకి బదిలీ చేశారు. పీసీబీ సభ్య కార్యదర్శిగా ఉన్న నీతూప్రసాద్‌ను అదనపు బాధ్యతల నుంచి తప్పించారు.

ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావుకు శౌర్యపతకం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావుకు శౌర్యపతకం లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం వీటిని ప్రకటించింది. కామారెడ్డి జిల్లా రాజయ్‌పేట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన మోహన్‌రావు జైళ్ల శాఖలో చేరి రాజమండ్రి, హైదరాబాద్ సెంట్రల్ జైళ్లలో విధులు నిర్వహించారు. 2010లో ఫైర్ సర్వీసెస్‌లో చేరిన ఆయన 2018 సంవత్సరం నుంచి సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్‌లో ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

బోనాల జాతర ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ స్పీకర్

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ, నల్ల పోచమ్మ బోనాల జాతర ఏర్పాట్లను శుక్రవారం రాత్రి స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని పలు విభాగాల అధికారులు, ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, అర్చకులు తిరుమలాచార్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అడ్డగుట్ట: ఎప్పటికప్పుడు స్థానిక సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి అన్నారు. అడ్డగుట్ట బి సెక్షన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. స్థానికులు ఎప్పటికప్పుడు సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మధు, సత్తయ్యగౌడ్, వసంత, మహ్మద్, నరేష్, మల్లేష్, శివ, శంకర్, రామస్వామి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

లాలాపేట: అబద్ధపు హామీలతో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎస్సీ వర్గాలను ఆశలపల్లకిలో తిప్పుతుందే తప్ప ఎలాంటి మేలు జరగడం లేదనీ బీజేపీ మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ శంకర్రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ పిలుపు మేరకు సికింద్రాబాద్ నియోజక వర్గం బీజేపీ నేతలతో కలిసి లాలాపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. అంబేడ్కర్ ఆశలు, ఆశయాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం తూట్లుపొడుస్తోందన్నారు.నాగేశ్వర్‌రెడ్డి, వేణు, వెంకటేష్‌గౌడ్,ఉపేందర్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా వ్యాస పూజ

లాలాపేట: గురుపౌర్ణమి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భారతీయ శిక్షణ్ మండలి ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్లో వ్యాస పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్ మాట్లాడుతూ గురు శిష్యుల మధ్య పరంపర కొనసాగినప్పుడే జ్ఞానం వర్ధిల్లుతోందన్నారు. ప్రొ.ఇంద్రకాంత్ మాట్లాడుతూ గురువు గొప్పతనాన్ని వివరించారు. ఎకనామిక్స్ పరిశోధన విద్యార్థి సతీష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారతీయ శిక్షణ్ మండలి రాష్ట్ర అధ్యక్షులు ప్రొ శివరాజ్, వాయునందన్, జైసింగ్, విద్యారణ్య, డా. లక్ష్మణ్, రాజశేఖర్, వీరమల్లు, ఎల్లస్వామి, ప్రవీన్, ప్రసాద్, గోవర్ధన్, కోటేశ్వర్ తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సనత్‌నగర్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ అధికారులు శుక్రవారం ఎర్రగడ్డ టీబీ ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న సేఫ్టీ పరికరాలను ఉపయోగించి మంటలను ఎలా అదుపుచేయవచ్చని డెమో ద్వారా తెలియజేశారు. ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ నేతృత్వంలో అగ్ని మాపక సిబ్బంది హాజరై ఆస్పత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవడంపై అవగాహన కల్పించారు.

బోనాలకు ముస్తాబు

రేపటి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..



విద్యుద్దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్న బేగంపేట్ శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి దేవాలయం

సనత్‌నగర్: ఈ నెల 16న ఆషాఢమాసం చివరి ఆదివారం నిర్వహించే బోనాల జాతరకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా దేవాలయ కమిటీల ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు భద్రతాపరంగా ఎలాంటి లోపాలు జరక్కుండా ఉండేలా ప్రధాన ఆలయాల్లో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిఘా ఉంచనున్నారు. బోనాల మహోత్సవాల నేపథ్యంలో ఆలయాలు విద్యుద్దీపాలతో శోభయామానంగా వెలుగొందుతున్నాయి. సనత్‌నగర్ డివిజన్‌లో 18 ఆలయాలు, అమీర్‌పేట డివిజన్‌లో 21, బేగంపేట డివిజన్‌లో 37 ఆలయాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు ప్రభుత్వం తరుపున అమ్మవారి ఆలయాలను అందంగా అలంకరించే నేపథ్యంలో ప్రత్యేక నిధులు కూడా మంజూరు చేశారు. ఇప్పటికే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆయా ఆలయ కమిటీలకు నిధులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఆయా నిధులతో ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

- సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి బోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి పాలాభిషేకం, 7 గంటలకు పుష్పాలంకరణ, బోనాల సమర్పణ, 11 గంటలకు అమ్మవారి ఘటం ఊరేగింపు, రాత్రి 9 గంటలకు బలిహరణ జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.
- బేగంపేట్ శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారి బోనాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలకు సర్వజన దర్శనం, ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందని ఆలయ ఫౌండర్ ట్రస్టీ చెక్కల సుభాష్‌ముదిరాజ్ తెలిపారు.



బేగంపేట కట్టమైసమ్మ అమ్మవారు

- బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని భూలక్ష్మీ అమ్మవారి ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీప కాంతులతో అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త విశాల్ సూదం తెలిపారు.
- ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆవరణలోని బంగారు మైసమ్మ ఆలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలకు ఈఎస్‌ఐ వైద్యాధికారులతో పాటు పలువురు రాజకీయ నేతలు హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ మనోహర్ తెలిపారు.
- అమీర్‌పేటలోని లక్ష్మీదుర్గా సోనా బాయి ఆలయంలో ఏటా నిర్వహించే రంగం కార్యక్రమం ప్రత్యేకతను చాటుతోంది. బోనాల ఉత్సవాల అనంతరం సోమవారం ఆలయ ముందు నిర్వహించే రంగంలో కుండపై నిలబడే మహిళ భవిష్యవాణి చెప్పే కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంటోంది.



సనత్‌నగర్ పోచమ్మ అమ్మవారికి నెమలి ఈకల దండను సమర్పిస్తున్న ఆర్‌బీ నరేష్, చిత్రంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి..

పోచమ్మ అమ్మవారికి మయూర ఈకల దండ..

సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం పోచమ్మ అమ్మవారికి కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్‌బీ నరేష్ ప్రత్యేకంగా తయారుచేయించిన మయూర ఈకల దండను శుక్రవారం అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, ఆర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాలాపేట: లాలాపేట, శాంతినగర్, తార్నాక తదితర ప్రాంతాల్లో అమ్మవారి దేవాలయాల వద్ద ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వేడుకల నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కూడళ్ల వద్ద విద్యుత్ దీపాలతో తోరణాలను అలంకరించారు.



ప్రారంభమైన చిలకలగూడ బోనాల జాతర



చిలకలగూడ ఆలయంలో వడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ, నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరిన భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు మహిళలు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వడిబియ్యం సమర్పణతో చిలకలగూడ బోనాల జాతర ప్రారంభమైందని, శనివారం రాత్రి 7 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం కానుగుల వంశీయులు మైలబోనం సమర్పిస్తారని, ఆదివారం ఉదయం బోనాలు, సాయంత్రం ఫలహారం బళ్లు, తొట్టెల ఊరేగింపు, సోమవారం సాయంత్రం భవిష్యవాణి (రంగం) నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు తెలిపారు. ఆది, సోమవారాలో మంచినీటి సరఫరా చేస్తామని, చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద ఉచిత వాటర్ ప్యాకెట్లు స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు జలమండలి మారేడుపల్లి డీజీఎం కృష్ణ తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీత్‌దత్, చిలకలగూడ ఏసీపీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ సీఐ మట్టంరాజు తెలిపారు.

'భట్టి'కి సనత్‌నగర్ కాంగ్రెస్ నేతల అభినందన



మల్లు భట్టి విక్రమార్కకు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ రవీందర్‌గౌడ్ తదితరులు

సనత్‌నగర్: యావత్ తెలంగాణ ప్రజల కష్టాలు, కడగండ్లను తెలుసుకుని వాటిని పరిష్కరించే లక్ష్యంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క 1400 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగిందని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. ప్రజా సంక్షేమం కోసం అలుపెరగకుండా విజయవంతంగా పాదయాత్రను పూర్తిచేసిన సందర్భంగా సనత్‌నగర్‌కు చెందిన పలువురు నాయకులతో కలిసి శుక్రవారం భట్టి విక్రమార్కకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం మళ్ళీ రానున్నదని, ప్రజలు కాంగ్రెస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. డివిజన్ అధ్యక్షులు రమేష్, టీపీసీసీ సెక్రటరీ బాబు, కమల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఉజ్జయినీ మహంకాళి దేవాలయానికి భక్తుల తాకిడి



దేవాలయం బయట బారులుతీరిన భక్తులు

రాంగోపాల్‌పేట్: ఆషాఢమాసంలో వచ్చే చివరి శుక్రవారం కావడంతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. దేవాలయం నుంచి మహంకాళి పోలీస్ స్టేషన్ వరకు భక్తులు క్యూ లైన్లలో వేచిచూస్తూ ఉన్నారు. అమ్మవారికి బోనాలతో పాటు ఒడిబియ్యం, చీరెలు, పసుపు కుంకుమలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. జాతరలో వాలింటీర్లుగా పనిచేసిన మక్తల ఫౌండేషన్ ప్రతినిధులను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభినందించి సర్టిఫికేట్‌లను అందించారు.

బీసీని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యం

కంటోన్మెంట్: రాష్ట్రంలో బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేయడమే తమ పార్టీ లక్ష్యమని తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకలు పుంజాల వినయ్ కుమార్ అన్నారు. సిఖ్‌విలేజ్‌లోని రాజరాజేశ్వరి గార్డెన్స్‌లో పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత పి. శివశంకర్ తనయుడు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పార్టీ ఆవిర్భావానికి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పించటం రాజ్యాధికారంలో మహిళలను భాగస్వాములను చేయడం, రైతుల సంక్షేమాన్ని సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ సమాజ కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయటమే తెలంగాణ సమాజ కాంగ్రెస్ ఏకైక లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నరహరి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

బంగారు మైసమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ బంగారు మైసమ్మ దేవాలయంలో శుక్రవారం సాయంత్రం నుంచి బోనాల ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. బంగారు మైసమ్మ అమ్మవారిని పట్టువస్త్రాలు సమర్పించిన శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ బోనాల వేడుకలను ప్రారంభించారు. బంగారు మైసమ్మ దేవాలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, పలువురు బీఆర్ఎస్ నాయకులు, మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హాజరయ్యారు.



బంగారు మైసమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

యువత ఆకాంక్షలకు ప్రాధాన్యం

కంటోన్మెంట్: యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. కంటోన్మెంట్ ఆరోవార్డు మస్తానా హోటల్‌లో 'కేఫ్ పాలిటిక్స్'పేరిట స్థానిక యువతతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ చొరవతో రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో బహుళ జాతి సంస్థలు పెట్టుబడులు పెట్టి, యువతను ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో త్వరలోనే ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తానని అన్నారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకట్ రాములు, రాకేష్, వంశీ, రిషికేశ్, సంజీవ్, కనక సుందర్, సందీప్, అంజి, అవినాష్, అంకిత్ మరియు తదితరులు



యువతతో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్


దారి దోపిడీలకు పాల్పడుతున్న 12 మంది అరెస్టు

కంటోన్మెంట్: దారిదోపిడీలకు పాల్పడుతున్న రెండు వేర్వేరు ముఠాలకు చెందిన 12 మంది నిందితులను మారేడుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రయాణికుడి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన కంటోన్మెంట్ గాంధీ కాలనీకి చెందిన వనపర్తి ప్రభుకుమార్ (18), గందమల్ల మనీష్ కుమార్ (19), మల్కాజ్‌గిరికి చెందిన దాసారం శ్రీకాంత్ (23), షేక్ అష్రాఫ్ అహ్మద్ (24), కొలుపుల రాజా (24), యాప్రాల్‌కు చెందిన పాలిపోగు రాజు (18)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి బాధితుడికి సంబంధించిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఉప్పల్ చిలుక నగర్‌కు చెందిన మల్యాల భాను ప్రసాద్ గత సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో మిత్రుడిని జేబీఎస్‌లో డ్రాప్ చేసి తిరిగి వెళ్లే క్రమంలో నిందితులు అతనిపై దాడి చేశారు. బాధితుడి వద్ద డబ్బులు దొరకకపోవడంతో అతని ఐక్యూఓఓ ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

- మరో కేసులో అతిగా మద్యం సేవించిన ఆరుగురు నిందితులు వైఎంసీఏ గణేశ్ టెంపుల్ వద్ద ఫుట్‌పాత్‌పై నిద్రించిన వ్యక్తి నుంచి రూ.10 వేల నగదు, మరో బాధితుడి నుంచి సెల్ ఫోన్ లాక్కుని వెళ్లారు. నిందితులు సికింద్రాబాద్‌కు చెందిన సందీప్ (25), దిలీప్ (20), బెజ్జంకి రాజేశ్ (24), పసుపుల కిరణ్ (23), ఎండీ సమీర్ (22), పాడేరు మణికంఠ (21)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు కేసుల్లో నిందితులు బోనాల పండుగ నేపథ్యంలో మద్యం మత్తులో నేరాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

మల్లు రవికి నేతల శుభాకాంక్షలు

టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ మల్లు రవికి పలువురు కాంగ్రెస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మల్లురవిని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు బేగంపేట రమేష్, నరేష్, భరత్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. –సనత్‌నగర్



భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అంజనేయులు తెలిపిన మేరకు.. బీకేగూడలో నివసించే ఎం.తరుణ్ (20) రెండేళ్ల క్రితం తన క్లాస్‌మెంట్ అయిన పూజితన ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక పాప ఉంది. మూడు నెలల క్రితం భర్తతో గొడవపడి కూతుర్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రావాలని పూజితను కోరినా ఆమె రాకపోవడంతో తరుణ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు.ఒక సారి కత్తితో చెయ్యి కోసుకోవడంతో పాటు మరో సారి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.రెండు పర్యాయాలు అతడిని కాపాడిన కుటుంబ సభ్యులు కౌన్సిలింగ్ కూడా చేయించారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో చేయూత

లాలాపేట: పేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో చేయూతనిస్తుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో తార్నాకకు చెందిన లబ్దిదారులు ఠాకూర్ మహేందర్ సింగ్, శివ తదితరులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరు పత్రాలను అందజేశారు.

'ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్'

లాలాపేట: ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఆస్ట్రేలియాలో భారత రాయబారిగా పని చేసిన ఎ. గీతేష్ శర్మ అన్నారు. జీ20 యూనివర్సిటీ కనెక్ట్ లెక్చర్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఓయూలోని దూర విద్యా కేంద్రం ఆడిటోరియంలో' ఎంగేజింగ్ యంగ్ మైండ్స్' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విదేశాలతో భారత సంబంధాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ. వి. ప్రవీణ్‌రావు, డా. జాహగీర్దార్ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

సనత్‌నగర్: వాకర్స్‌కు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కోవెల్స్ స్కూల్ ఎదురు పార్కులో, భగత్‌సింగ్ పార్కులతో పాటు మొత్తం 11 ఉద్యానవనాల్లో ఏర్పాటుచేసిన లైట్లను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ..జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కడా లేనివిధంగా సనత్‌నగర్‌లో పార్కులు ఉన్నాయని, వాటన్నింటినీ అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాత్రి వేళల్లో సైతం వాకింగ్ చేసుకునేందుకు వీలుగా అన్ని పార్కుల్లో లైట్లను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈ కిరణ్మయి, నాయకులు బాల్‌రెడ్డి, సరఫ్ సంతోష్, ఖలీల్‌బేగ్, ఫాజిల్, షఫీ, శేషు వరప్రసాద్, విష్ణు, నందకిషోర్, శ్రీను, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



పార్కులో లైట్లను ప్రారంభిస్తున్న సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

ఎన్‌సీసీ క్యాడెట్లు మన దేశ భవిష్యత్తు

రసూల్‌పురా: ఎన్‌సీసీ క్యాడెట్లు మన దేశ భవిష్యత్తు అని వారిలో సరైన విలువలు శిక్షణ, క్రమ శిక్షణ పెంపొందిచడం ద్వారా వారిని బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఆంధ్ర తెలంగాణ ఎన్‌సీసీ డైరక్టరేట్ డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌సీసీ డైరక్టరేట్ కార్యాల యంలో శుక్రవారం జరిగిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ సమావేశంలో క్యాడెట్ల శిక్షణ విధానాన్ని సమీక్షించారు. క్యాడెట్లకు నాణ్యమైన శిక్షణ అందజేయాలని డీడీజీ సూచించారు. క్యాడెట్లను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశ నిర్మాణ ప్రక్రియకు దోహదపడుతుందని గ్రూప్ కమాండర్లకు వివరించారు.



గ్రూప్ కమాండర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎన్‌సీసీ డిప్యూటి డైరక్టర్ జనరల్ వీఎం రెడ్డి

ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీకి రాజకీయ సమాధి

లాలాపేట: ఎస్సీ వర్గీకరణ చేయకపోతే వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి రాజకీయంగా సమాధి కట్టడానికి మాదిగలంతా సిద్ధంగా ఉన్నారని మాదిగ హక్కుల దండోరా నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలో ఎంహెచ్‌డీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్, రాష్ట్ర అధ్యక్షులు కొంగర నరేష్ మాదిగలు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అయినా వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధం చేయాలనీ డిమాండ్ చేశారు. లేకపోతే మాదిగ ఆగ్రహానికి గురికావాలసి వస్తుందని హెచ్చరించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు, దర్శనం, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ శుక్రవారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో రూ. 1.63కోట్ల వ్యయంతో చేపట్టిన 9 రకాల అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బన్సీలాల్‌పేట్ ప్రాంతంలో రోడ్లు అస్తవ్యస్తంగా అధ్వానంగా ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలులేండా ఉండేవన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో అనేక రోడ్ల రూపురేఖలను మార్చివేయడంతో ప్రస్తుతం అవి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలను తలపిస్తున్నాయన్నారు. గత 9 సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసినట్లు వివరించారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటిప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజల మౌళిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, పార్కుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేశామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు ఎంతో సంతోషపడుతున్నారని తెలిపారు.



నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానికులతో కలిసి శంకుస్థాపన చేసిన మంత్రి తలసాని

మంత్రి దృష్టికి సమస్యలు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు స్థానికులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు.
- న్యూబోయిగూడ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ స్థానికంగా రోడ్లు వేయాలని, డ్రైనేజీ నూతన పైపులైన్ వేయించాలని కోరారు.
- క్రిష్ణానగర్ బోలక్‌పూర్ స్కూల్ సమీపంలో నూతన రోడ్డు వేయాలని స్థానికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.
- బోయిగూడ సున్నంబట్టీ ప్రాంతంలో నాలాలో చెత్తాచెదారం పెరుకుపొయి వర్షాకాలంలో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తుందని వెంటనే నాలా శుభ్రం చేయించాలని కోరగా మంత్రి వెంటనే ఇంజనీరింగ్ విభాగం అధికారులను పిలిచి చర్యలు తీసుకోవాలని కోరారు.
- బోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్థానికులు చెత్తాచెదారాన్ని, వ్యర్థాలను వేసి పరిసరాలను దుర్గంధంగా మార్చుతున్నారని చెప్పారు. దీంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులను పిలిచి ఇక్కడ ఫుట్‌పాత్‌లను నిర్మించి అభివృద్ధి చేస్తే చెత్తాచెదారం వేయకుండా ఉంటుందని నిర్మాణ పనులకు చర్యలు తీసుకోవాలని సూచించారు.
- బోయిగూడ డాన్‌బోస్కో స్కూల్ సమీపంలోని పార్కును ఆధునీకరించాలని ఉద్యానవనశాఖ అధికారులను ఆదేశించారు.
- బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అదే విధంగా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో జోనల్ కమీషనర్ రవికిరణ్, డిప్యూటీ కమీషనర్ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, అంజనేయులు, నవీన్, విద్యుత్తు శాఖ ఏడీఈ మహేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కిస్టోఫర్ పాల్గొన్నారు.